# వైరస్

సందీప్ మల్ హోత్రా తన ఆఫీసు ఏసీ అర్రలో కంప్యూటరు ముందర కూర్చొని గంభీరంగా పని చేసుకుంటున్నాడు. అతని పి.ఏ. సుబ్బయ్య పరుగు నడకతో లోపలికి వచ్చాడు. అతని ముఖం మీద ఆందోళన శరీరంలో వణుకు కన్పించాయి.

"సార్!" అని ఆత్రంగా పిల్చాడు.

"పని చేయనియ్యరు వీళ్ళు!" విసుక్కుంటూ సందీప్ రివాల్వింగ్ కుర్చీని సుబ్బయ్యవైపు తిప్పాడు.

"ఏందయ్యా! పరేషాన్‌గ వున్నవ్. అట్ల చెమటలు కక్కుతున్నవ్ ఏంది సంగతి?" అడిగాడు సందీప్ మల్‌హోత్రా. విధులను నిర్వర్తించాలన్న యావవున్న ఆఫీసరు అతను. కాని ఎప్పటికప్పుడు మంత్రుల ఆదేశాలు అతన్ని ఎప్పుడూ ఏ పనినీ చేయకుండా అడ్డుపడ్తూనే వుంటాయి.

"మళ్ళేమొచ్చింది. చెప్పవేంది సుబ్బయ్య!" విసుక్కున్నాడు. సందీప్ మల్‌హోత్రా రాజస్థానీ వాడు. ఐఏయస్‌లో ఆంధ్రప్రదేశ్ కేడర్‌లో సెలక్టయ్యాడు. వెంటనే ధారాళంగా తెలుగు మాట్లాడటం నేర్చుకున్నాడు. అక్కడ ఇక్కడా డిప్యూటీ కలెక్టరుగా పనిచేసి ఇప్పుడు రంగారెడ్డి జిల్లా కలెక్టరుగా వచ్చాడు. కాస్త పని చేస్తాడని డ్యూటి మంతుడని తమ పని యేదైనా వుంటే భక్తి శ్రద్ధలతో చేస్తాడని పేరు సంపాదించుకొని మంత్రుల దృష్టిలో పడ్డాడు కాబట్టే ఈ పోస్టింగుకు వచ్చాడు. అంతర్జాతీయ విమానాశ్రయం అవుటర్ రింగురోడ్డు వేసే నేపథ్యంలో ముఖ్యమంత్రిగారు అతన్ని పని చేస్తాడని ఈ సీట్లో వేసారు. అసలు అంతర్జాతీయ విమానాశ్రయం హయత్‌నగర్ వస్తుందా? శంషాబాద్‌లో వస్తుందా? అని మంత్రివర్గం ఇంకా ప్రకటించలేదు. అంతా ఇంకా గుప్తంగా వుంది. కాని హైద్రాబాదు చుట్టుపక్కల గ్రామాల్లోని రైతుల భూములను వందలకొద్ది ఎకరాలు కొనుగోలు జరుగుతున్నాయి. బినామీ రిజిస్ట్రేషన్లు రోజు వందలకొద్ది జరుగుతున్నాయి. ఏజంట్లు పుట్టగొడుగుల్లా పుట్టి మోటరు సైకిళ్ళమీద తెగ తిరుగుతున్నారు. రైతులను భూములమ్మమని డబ్బు ఆశ పెడ్తున్నారు.

"ఈ భూములమ్ముకొని ఏడికి పోతం? ఎట్ల బతుకతం?" అని రైతులు భూములమ్ముకోలేక వుంచుకోలేక పిసుక్కచస్తున్నారు.

"ఒక వరి మొక్కను భూములనుంచి పీకి దాన్ని మల్ల నాటుపెడ్తేనేగద పెరిగి పెద్దదయి వరి వెన్ను పెట్టేది. గట్లనే మీరు మీ తండ్రి తాతల జాగల నుంచి కదులుతే బాగుపడ్తరు" – అని ఏజంట్లు రైతులకు నచ్చజెప్పారు.

"గంతేకావచ్చు! బోరుల్ల నీళ్ళు లేక కరెంటు లేక ఏం పంట పండిస్తున్నం గనుక! పడావ్‌పడ్డ గీ చెల్కలను పొలాలను అమ్ముకొని పట్నం మొఖాన పోతేనన్న బాగుపడ్తం" అని యువకులు ఉత్సాహంగా ఊగిపోయారు. అట్ల విమానాశ్రయం రింగు రోడ్డు గురించి వార్తలు పొక్కక ముందటే నాయకులు మంత్రులు ఏజంట్లను సృష్టించి వందలకొద్దీ వేలకొద్ది ఎకరాలను కొనేసుకున్నారు. అయితే ఈ మధ్యనే జరిగిన మంత్రివర్గ విస్తరణలో ఇన్నాళ్ళు ముఖ్యమంత్రిగారి దగ్గర వుంచుకున్న భారీ పరిశ్రమల శాఖకు మీనయ్య మంత్రి అయ్యాడు. ఆఫీసులో అడుగు పెట్టిన నాడే అతనికి విమానాశ్రయం రింగురోడ్డు గురించి అర్థమైంది. వెంటనే రంగారెడ్డి జిల్లా కలెక్టరు పి.ఏ కు ఫోను చేసాడు.

"మీ కలెక్టరుకు చెప్పు కార్ల తయారీ కంపెనీ హైదరాబాదులో పెడ్తమని జర్మనీ దేశంనుంచి వచ్చారు. ఆ కంపెనీ ఏ రాష్ట్రానికి పోకుండా చూసుకోవాలంటే వెంటనే వాళ్ళకు మనం పన్నెండు వందల ఎకరాల భూమిని కేటాయించాలె! వెంటనే రాబోయే రింగురోడ్డు వెంబడే పన్నెండు వందల ఎకరాల భూమిని కొనుగోలు చేయమని నా అర్డరుగా మీ కలెక్టరుకు చెప్పు" అన్నాడు. అది విని సుబ్బయ్య పరేషాన్ అయిండు. కలెక్టరుకు విషయం వివరించాడు.

"అర్రే! నెల లోపట్నే పన్నెండొందల ఎకరాలు సేకరించటమంటే మాటలా! ఇట్ల ఎకాఎకి ఏక్‌దమ్‌న ఇంత భూమిని రైతుల నొప్పించి కొనాలంటె ఎట్ల!" తికమక అయిండు సందీప్ మల్‌హోత్రా. అయినా ఇది రాచకార్యం నెరవేర్చక తప్పదు.

"మరే తికమక కాకుండి సార్! ఇంకా రైతులకు విమానాశ్రయం రింగురోడ్డు గురించి ఏం ఎర్కలేదు. ఏ ధర ఇచ్చినా మంచి ధర వస్తుందనుకునే అమాయకులు. భవిష్యత్తు ఏమౌతుందన్న అంచనా లేని వెర్రివాళ్ళు. అయినా మంత్రిగారిని కొంచెం చెయ్యి విడువమనాలె. అట్లంటె గుంటూరు భూముల లెక్క అనుకుంటడేమొ. అక్కడి ఎకరం అమ్ముకుంటే ఇక్కడ నూరెకరాలు కొనుక్కోవచ్చునని చెప్పండి మంత్రిగారికి. "పెద్ద" సలహానే ఇచ్చాడు పి.ఏ.

వెంటనే ఏజంట్లు పనిలోకి దిగారు. ఇప్పగుంటలో పన్నెండొందల ఎకరాల భూమిని చూసారు. బజారు ధరకన్నా ఓ వెయ్యి రూపాయలు ఎక్కువ ఆశ చూపి బేరం చేసారు. రేపు రింగురోడ్డు వస్తే ఆ భూమి కోట్లల్లో వుంటుందని తెలియని పేద రైతులు ఆ కొంచెం ధరకే మురిసిపోయారు. తొండలు కూడ గుడ్లు పెట్టని భూములు! ఇయ్యాల రెండు వేలకు ఎకరం పోతుందంటె తమ అదృష్టమే అనుకున్నారు. అంతే డబ్బు చేతులు మారింది. భూముల రిజిస్ట్రేషన్ చకచక అయిపోయింది. ఎవరిపేర రిజిస్ట్రేషన్ అయ్యాయో ఎవరూ పట్టించుకోలేదు. కాని ఆ భూమిలో జర్మన్ కార్ల కంపెనీ వెలుస్తుందని పత్రికల్లో

పెద్దపెద్ద ప్రకటనలు వచ్చాయి. ఆ కార్లు ఎలక్ట్రిక్ కార్లు! భవిష్యత్ టెక్నాలజీతో తయారయ్యే కార్లు! అవి నడవాలంటే పెట్రోలే అవసరం లేదు. పెట్రోలు ధరలు పెరిగి పోతున్నాయని సామాన్య కారు ఓనరు చింత పెట్టుకోనవసరంలేని కార్లు! అని అందమైన ప్రకటనలు జనం చదువుకున్నారు. "అబ్బ! మన దేశం ఆధునికమైన టెక్నాలజీలో ముందంజ వేయబోతున్నది! ప్రగతి ఎంతో దూరం లేదు. పేదరిక నిర్మూలనం అని ప్రతి యాభై సంవత్సరాలకు నినాదాలు ఇయ్యవలసిన అవసరమే వుండదిక" – అని నమ్మారు సామాన్య జనులు.

ప్రకటన వచ్చిన వెంటనే ఓ పెద్ద సభ జరిగింది. ఆ పన్నెండొందల ఎకరాల భూమిలో పెద్ద వేదికను వేసారు. మైకులు పెట్టారు. ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖల మంత్రులు, పార్టీ అధ్యక్షులు వచ్చారు. జనాన్ని చేరవేయటానికి లారీలను నడిపారు. కిక్కిరిసిన జన సమూహాన్ని చూసి పార్టీ అధ్యక్షుడు మళ్ళా ఎన్నికల్లో తమ విజయం తప్పదనుకున్నాడు. అపోజిషన్ పార్టీ అంటేనే ఎదిరించటమే కర్తవ్యమాయె. ఇక్కడ ఇంత సభ సంబరం జరుగుతుంటె వాళ్ళకు ఒళ్ళుమండిపోతున్నది. ఎట్లా ఎదిరించాలో తెలియక నిరసనలు ప్రకటించారు. కార్ల కంపెనీకి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. "ప్రపంచీకరణం నశించాలి! ప్రపంచ బ్యాంకు నాశనం కావాలె! – విదేశీ పెత్తనాన్ని సహించం! – దేశాన్ని విదేశీ కంపెనీలకు అమ్మటం నిరసించాలె! సామ్రాజ్యవాదాన్ని ఎదరిద్దాం!" – అని గొంతులు ఎండిపోయేలాగా ఎర్రటి ఎండలో నిలబడి అరిచారు. పోలీసులు యధావిధిగా వచ్చి వాళ్ళను లాఠీలతో తరిమారు. మరీ లాఠీలను చూసి కూడా బెదరని వాళ్ళుంటే వాళ్ళను అరెస్టు చేసి వ్యానుల్లో ఎక్కించుకపోయి కొంచెం దూరంలో విడిచిపెట్టారు. అటు సభ జోరుగా సాగుతూనే వుంది. సభలో జర్మనీ నుంచి కార్ల కంపెనీ ప్రతినిధి ఒకాయన వచ్చాడు. హెర్ లెట్టింగర్ అని అతన్ని రాష్ట్ర భారీ పరిశ్రమల మంత్రి పరిచయం చేసాడు. మెడలో ఓ తాజా పూల దండను వేసాడు. ఆ పూల దండను చూసుకొని హెర్ లెట్టింగర్ మురిసి పోయాడు. మాటిమాటికి పూలను వాసన చూస్తూ ఆనందించాడు. ఏం మాట్లాడలేదు. భాష సమస్య అనుకున్నారు అందరూ. ముఖ్యమంత్రి ఆ నిండు సభలో అంతర్జాతీయ విమానాశ్రయం రింగ్ రోడ్డు నిర్మాణం జరుగుతుందని ప్రకటించాడు. రాష్ట్ర భారీ పరిశ్రమల మంత్రి కార్ల కంపెనీ స్థాపన గురించి చెప్పాడు, ఆ కంపెనీలో యాభై శాతం ఉద్యోగాలు ఇప్పగుంట ఊరి యువకులకే ఇస్తామని పెద్ద గొంతుతో గట్టి వాగ్దానం చేసాడు. పేదరికం నిర్మూలనకు విమానాశ్రయాలు రింగు రోడ్డులు, కార్ల కంపెనీలు ఎట్లా తోడ్పడుతాయో కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి వివరించి ఆ పక్కనే కంప్యూటర్లను తయారు చేసే కంపెనీకి అనుమతిని జారీ చేసాడు. ఎవరికి జారీ చేసాడో ఎవరూ పట్టించుకోలేదు కాని పెద్దగా చప్పట్లు అయితే చరిచారు. పేదరిక నిర్మూలనం చేస్తామని నినాదం చేసాడు పార్టీ అధ్యక్షుడు. సభ ముగిసింది. ఎక్కడివాళ్ళు అక్కడికి వెళ్ళిపోయారు.

ఎన్నాళ్ళు గడిచినా జర్మన్ కార్ల కంపెనీ మాత్రం ఆ ఊరికి రాలేదు. జర్మన్ కంపెనీ తమకు ఇండియాలో కార్ల కంపెనీ పెట్టే ఉద్దేశమే లేదని ప్రకటించిన వార్త

ఒకటి ఒకరోజు ఏదో పత్రికలో ఓ మూల పడింది. జర్మనీలోని కార్ల కంపెనీకి ఇప్పగుంటలో జరిగిన సభ సంగతి తెలిసి అవినీతి అక్రమానికి తామెక్కడ బద్నాం అవుతామో అని ఆ వార్తను పత్రికకెక్కించారు. ఆ సభలో పాల్గొన్న జర్మన్ దేశీయుడెవరని అక్కడి ప్రభుత్వం ఆరా తీయటం మొదలుపెట్టింది. ఆ వార్త ఎందుకు పడిందో భారతదేశంలో ఎవరికీ అర్థం కాలేదు. ఆ వార్తకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సంబంధముందని ఎవరూ గుర్తించలేదు. కాని రాబోయే రింగు రోడ్డు పొంటి తను ఓ పన్నెండొందల ఎకరాలు సంపాదించుకోగలిగానిట్లా అని మీనయ్య ఆనందం సంతృప్తిలో మునిగితేలాడు.

ఇక ఇప్పగుంటలో మార్పులు శరవేగంగా వచ్చాయి. ఊరి స్వరూపమే మారిపోయింది. దుమ్ము కొట్టుకపోయే, పందులు కుక్కలు యథేచ్ఛగా సంచరించే సందులు గొందులు అట్లనే వున్నయి. గూనపెంకులతో కూలిన ఇండ్లు తాటాకు గుడిసెలు అట్లనే వున్నయి. కానీ దుకాణాలు చాయ్ హోటళ్ళు పాన్ డబ్బాలు ఎక్కడబడితే అక్కడ పుట్టుకొచ్చాయి. వాటిని ఆశ్రయించే పనికిమాలిన యువకుల సంఖ్యకేం తక్కువలేదు. ధగధగమని లైట్లతో వెలిగిపోయే మోటార్‌సైకిళ్ళ కార్ల షోరూమ్‌లు దేశవిదేశీ మద్యాలనమ్మె షాపులు బార్లు బోలెడన్ని వెలిసాయి. సూపర్‌మార్కెటులూ వచ్చాయి. ఇప్పుడు మొండెయ్య బట్టలుతకడం బంద్ చేసి మోటర్ సైకిల్ ఎక్కి తిర్గుతున్నడు. ఆడపిల్లలు తిరిగేచోట మోటర్‌సైకిల్ ఆపి దాని మీదికి ఒరిగి కూర్చొని స్టైల్‌గా చేతి గడియారంలో టైమ్ చూసుకుంటూ "వస్తావా పట్నానికి?" అన్నట్లుగా కనుసైగ చేస్తున్నాడు. రాగ్యానాయక్ పొలం పనులు బందుపెట్టాడు. మోటారు సైకిల్‌ను రేస్‌లో నడిపినట్లుగా జోరుగా నడుపుతూ పనివున్నా లేకపోయినా అటు ఇటు చక్కర్లు కొడుతూ ఊర్లో దుమ్మును రేపుతున్నాడు. మైసయ్య చెప్పులు కుట్టటం మానేసి వెనకటికెప్పుడో సర్వోదయ వాళ్ళు పంచిపెట్టిన భూమిని అమ్ముకున్నాడు. వచ్చిన డబ్బుతో వ్యాగన్ ఆర్ కారు కొని తన గుడిసెముందల బర్రెగొడ్డును కట్టేసినట్లుగా నిలబెట్టుకొని హాఫ్‌ప్యాంటు వేసుకొని తిరుగుతూ తెగ మురిసి పోతున్నడు. ఏ పనీలేని తిరుగుడుగాండ్లు ఎక్కువయ్యారు. "ఏమైన పని చూసుకోర కొడుకా! భూమి అమ్మిన పైసలు ఎంత కాలం కూసొని తింటవ్‌రా!" అని ఇంట్లో ముసలివాళ్ళ పోరు ఆ ఊరిలో మామూలైంది.

ఎహ్! కార్ల కంపెనీ వస్తే అండ్ల నౌకరి ఖాయంగా దొర్కుతదే! ఫికర్ చేయకుండ్రి!" అని యువకులు దీమాతో జీన్స్ ప్యాంట్లు టీషర్టుల్లో జవాబులు చెప్తూ ఫికర్ లేకుంట తాగుతున్నరు, తింటున్నరు, తిర్గుతున్నరు.

"ఏమో! గిదంత ఎట్లనో వున్నది. అంత నాశనగాలానికి వచ్చింది. ఎన్కటి దొరలు దేశముఖులు పేదోళ్ళ భూములు కాజేసిండ్రని విన్నం గాని గిట్ల మొత్తం ఊరినే పాదు సేసిండ్రని వినలేదు. అని ఊరి ముసలోళ్ళు దొమ్మరి తిరుగుళ్ళు తిరిగే పోరగాండ్లను చూసి పరేషానయితున్నరు.

ఇంతల కార్ల కంపెనీ లేదు ఏం లేదు అంతా ఉత్తమాటలే ఉల్లెక్కాల సభనే అన్న వార్తలు ఇప్పగుంటలో గుప్పుమన్నయి. భూమంత పట్నపోళ్ళే కొనుక్కున్నరంట, జర్మనోడు గాదు ఏం గాదు అని తెలిసింది. యువకులు ముఖాలు వేలాడేసారు. భవిష్యత్తు

చీకటి గొయ్యిలా తోచింది. అంతర్జాతీయ విమానాశ్రయం రింగురోడ్డు పనులు మాత్రం నత్తనడకతో సాగుతూనే వున్నాయి.

"నాయకులు ఓట్లకోసం నిలబడేది వాళ్ళ ఆస్తుల సంపాదనకే గాని దేశం అభివృద్ధికి పేదరిక నిర్మూలనకు కాదు. కంప్యూటరులో వైరస్ ప్రవేశిస్తే మొత్తం దానిలో సిస్టమంతా చెడిపోయి పని చేయకుంట అయితది. గట్లనే దేశం అభివృద్ధి అనే సిస్టమ్‌ను పనిచేయకుంట చేస్తున్న వైరస్ ఎవరో కాదు వీళ్ళే!" – అనుకున్నాడు ప్రైమరీ స్కూలు ఏకోపాధ్యాయుడు. ఆ ఊరిలో ఓ నిర్జనంగా వున్న మూలలో కూలిన కప్పుతో మొండి గోడలతో తలుపుకు తాళం వేసివున్న ప్రాథమిక హెల్త్ సెంటర్ పక్కనే వున్న పాడుబడిన బడిలోని క్లాసు రూం అది. తన ముందు నేలమీద చినిగిన గుడ్డలతో చీమిడి కారే ముక్కులతో బాన కడుపులతో ముసిరే ఈగలను దోమలను విసిరే ఓపిక లేకుండా కూర్చున్న చిన్నారుల ముఖంవైపు చూస్తూ నిట్టూర్చాడు ఆ ఏకోపాధ్యాయుడు.

*"నేటి నిజం" నవంబరు **2006**, ప్రత్యేక సంచిక*